సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



ప'వర్రీ' తగ్గించేందుకు..

జిల్లాలో 13 కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపించారు.

- 8లో



పండగ పూట విషాదం

వినాయక చవితి ముందు రోజున ఆబోతుల పేట యువకుడు ప్రమాదానికి గురయ్యాడు. ఆ తర్వాతి రోజు కన్నుమూశాడు.

- 8లో

నేడు రణస్థలంలో 'జగనన్నకు చెబుదాం'

రణస్థలం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి స్పందన కార్యక్రమం బుధవారం రణస్థలంలో జరగనుంది. ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అధ్యక్షంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి నంది నాటక ఉత్సవాలకు 'శార్వాణీ' నాటిక

కవిటి: రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవాలకు కవిటి మండలం బొరివంక శార్వాణీ గిరిజన సాంస్కృతిక సమాఖ్యకు చెందిన కొత్తపరిమళం నాటికను ఎంపిక చేస్తూ ఎంపిక కమిటీ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇటీవల శ్రీకాకుళంలో వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన స్క్రూటీనీలో తమ నాటికను బొరివంక శార్వాణీ సంస్థ ప్రదర్శించింది. ఏపీ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ విజయవాడ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలను నంది నాటకోత్సవాలు–2022 పేరిట నిర్వహిస్తున్నారు. తుది పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 12 జట్లను నంది నాటకోత్సవాలకు ఎంపిక చేసినట్టు శార్వాణీ గిరిజన సాంస్కృతిక సమాఖ్య దర్శకుడు కేకేఎల్ స్వామి తెలిపారు. దీనిపై జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా తదితరులు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

వాసుదేవుని సన్నిధిలో విశ్వక్సేనుని పూజలు



వాసుదేవుని సన్నిధిలో విశ్వక్సేనుడి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మందస: మందస పట్టణంలోని శ్రీవాసుదేవుని సన్నిధిలో శ్రీవిశ్వక్సేనుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో విఘ్న నివారణ చతుర్థి సందర్భంగా అభిషేకాలు, అర్చనలు జరిపారు. 14వ శతాబ్దం నుంచి విశ్వక్సేనుడు ఈ ఆలయంలోకి వేంచేశారని కూర్మాచార్యులు చెప్పారు. ఉద యం నుంచే శ్రీవాసుదేవునికి కూడా ప్రత్యేక అలంకృతుని చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

టెక్కలి సబ్ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



టెక్కలి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నూరుల్ కమర్‌కు సాదర స్వాగతం

టెక్కలి,శ్రీకాకుళం పాత బస్టాండ్: టెక్కలి సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి నూరుల్ కమర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా విధులు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిపాలనాధికారి బి.రాజమోహన్, తహసీల్దారు కె.ప్రవళ్లికప్రియ తో పాటు సిబ్బంది సబ్‌కలెక్టర్‌కు సాదరంగా స్వాగతం పలికారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న నూరుల్ కమర్ టెక్కలి బదిలీ అయిన సంగతి తెలిసిందే. అలాగే ఆయన మంగళవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

పోర్టుకు రైలు, రోడ్డు మార్గాలకు భూ సేకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూలపేట పోర్టుకు రైలు, రోడ్డు మార్గాలకు సంబంధించి భూ సేకరణ పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మూలపేట పోర్టు రైలు, రోడ్డు మార్గాలకు సంబంధించి భూ సేకరణ పై ఆయన టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో పాటు సంబంధిత అధికారులతో సమీక్షించారు. రైల్వే ట్రాక్‌కు సంబంధించి భూ సేకరణ వివరాలు అందించాలని సంతబొమ్మాళి తహసీల్దార్‌ను ఆదేశించగా.. సంతబొమ్మాళి మండలంలో రైల్వే ట్రాక్ వేసేందుకు భూ సేకరణ రాజపురం, కూర్మనాథపురం, పోతునాయుడుపేట, హేమాలపేట, కాశీపురం, కోటపాడులో 79.45 ఎకరాలు సిద్ధంగా ఉందని తహసీల్దార్ చలమయ్య వివరించారు. టెక్కలి మండలంలో రోడ్డుకు సంబంధించి రఘునాథపురం భూములను సత్వరమే పోర్టు వారికి అప్పగించాలని టెక్కలి తహసీల్దార్‌కు ఆదేశించారు. బన్నువాడ, వేములవాడ, మోదుగువలస భూముల్లో రైతులు ఎవరు ఉన్నారనే వివరాలు తక్షణమే అందించాలన్నారు. ఈ గ్రామాలకు అవార్డు పెండింగ్‌లో ఉందని, ఆ వివరాలు శుక్రవారం నాటికి పంపాలని టెక్కలి తహసీల్దార్ ప్రవళిక ప్రియను ఆదేశించారు.

రుణ వాయిదా.. ఇక సులభం కదా



కోటబొమ్మాళి మండలంలో సెప్టెంబర్ 5న ప్రారంభించిన అవగాహన కార్యక్రమం(ఫైల్)

- పేటీఎం ద్వారా స్త్రీ నిధి రుణాల చెల్లింపు
- పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో 30 మండలాల్లో ప్రారంభం
- సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



బూర్జ: బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదు. గంటల కొద్దీ లైన్లలో నించోవాల్సిన అగత్యం లేదు. స్త్రీ నిధి రుణ వాయిదాను ఎంచక్కా ఇంటిలో ఉంటూనే చెల్లించేయవచ్చు. ఈ మేరకు ప్రభుత్వం కొత్త పద్ధతిని ప్రవేశపెట్టింది. పేటీఎం ద్వారా రుణ వాయిదాలు చెల్లించేందుకు వెసులు బాటు కల్పిస్తోంది. ఈ విధానాన్ని జిల్లాలోని కోటబొమ్మాళి మండలంలో సెప్టెంబర్ 5న ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ కొత్త విధానంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు తాము తీసుకున్న రుణాల వాయిదాలు చెల్లించేందుకు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదు. పేటీఎం ద్వారా డిజిటల్ విధానంలో వాయిదాలు కట్టేవయచ్చు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదు.

గతంలో రుణాలు చెల్లింపు ఇలా

జిల్లాలోని 30 మండలాల్లో 1293 గ్రామైక్య సంఘాలు, 49,030 గ్రూపులు, 5,60,662 సభ్యులు ఉన్నారు. గ్రూపుల్లోని సభ్యుల జీవనోపాధికి స్త్రీ నిధి బ్యాంకు రుణాలు అందిస్తుంది. స్త్రీ నిధి నుంచి తీసుకున్న రుణాలను నిర్ణీత కాలవ్యవధిలో నెల నెలా వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. పాత విధానంలో నెల వాయిదాలను గ్రూపు సభ్యులు లీడర్ ద్వారా గ్రామైక్య సంఘానికి చెల్లించేవారు. గ్రామ సమైక్య ఖాతా నుంచి గ్రామ సంఘం అధ్యక్షులు ద్వారా వీఓఏ స్త్రీ నిధికి ఖాతాకు జమ చేసేవారు. ఈ విధానంలో సమయం వృధా, అదనపు ఖర్చులు పెరిగేవి, నిర్ణీత సమయంలో చెల్లించకపోతే వడ్డీ భారం పడేది. ఈ నూతన విధానంలో పూర్తి పారదర్శకత ఉంటుంది.

ప్రతి గ్రామైక్య సంఘానికి పరికరం

ప్రస్తుతానికి జిల్లాలో 5 పేటీఎం మెషీన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ నూతన విధానంలో స్త్రీ నిధి మహిళా బ్యాంకు ప్రతి గ్రామైక్య సంఘానికి పేటీఎం మెషీన్ అందించాలని నిర్ణయించింది. పేటీఎం మెషీన్ గ్రామైక్య సంఘం నియమించిన వీఓఏ లాగిన్ అయి నిర్వహిస్తుంది. రుణం తీసుకున్న సభ్యులు తమ సంఘం లీడర్‌కు స్త్రీ నిధి రుణ వాయిదా మొత్తం చెల్లిస్తారు. వీఓఏ స్వయం సహాయక సంఘం సమావేశానికి హాజరై స్త్రీ నిధి రుణాల రికవరీ వివరాలు పేటీఎం మెషీన్‌లో నమోదు చేసి లావాదేవీలు పూర్తి చేయాలి. నగదుగా వసూలు చేసిన స్త్రీ నిధి రుణ మొత్తాలను సంఘం లీడర్ తన పర్సనల్ బ్యాంకు ఖాతా ఉపయోగించి (యూపీఐ పేమెంటు) స్త్రీ నిధికి చెల్లిస్తుంది. వెంటనే రశీదు కూడా వస్తుంది.

ఉపయోగించే విధానం..

- పేటీఎంలోకి వీఓఏ మొబైల్ నంబరుతో లాగిన్ కావాలి.
- ఏ వీఓఏకి సంబంధించిన పేమెంట్సు జరపాలని అనుకుంటున్నామో.. ఆ మొబైల్ నెంబరు నుంచి పిన్ లాగిన్ అవ్వాలి. పేమెంట్సు ఎస్‌హెచ్‌జీ ఐడీ నమోదు చేయాలి.
- నమోదు చేసిన వెంటనే ఆ సంఘంలో స్త్రీ నిధి రుణం తీసుకున్న సభ్యుల పేర్లు డిస్‌ప్లే అవుతాయి.
- డిస్‌ప్లే అయిన సభ్యులతో ఏ సభ్యురాలి ఈఎంఐ చెల్లించాలో డ్వాక్రా సభ్యురాలి పేరు మీద ఉన్న బటన్ సెలెక్ట్ చేయాలి.
- సభ్యురాలి డిమాండ్ మొత్తం, క్లోజర్ అవుట్ స్టాడింగ్ చూపుతుంది.
- సభ్యురాలు ఎంత ఈఎంఐ చెల్లించాలో ఆ మొత్తాన్ని నమోదు చేయాలి.
- ఈ విధంగా ఎంత మంది సభ్యులైతే పేమెంట్ చేస్తారో వారి రికవరీ మొత్తాలు నమోదు చేయాలి.
- తర్వాత నమోదు చేసిన మొత్తం, రికవరీ చేయాలనుకున్న మొత్తం సమానంగా ఉన్నాయో లేదా చూసుకోవాలి.
- పేమెంటు ఏవిధంగా చేయాలి అనేది ఎంపిక చేయాలి, రూపే కార్డు, స్కాన్ క్యూఆర్ కోడ్ యూపీఐ పేమెంట్ సెలెక్టు చేసి చెల్లింపులు జరపాలి.
- తర్వాత కంప్లీట్ ఆర్డర్‌పై క్లిక్ చేసి ప్రింటు ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ప్రింట్ రశీదు సభ్యురాలికి అందజేయాలి.

బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేదు



ఈ కొత్త విధానం వల్ల ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు తాము తీసుకున్న రుణాల వాయిదాలు చెల్లించేందుకు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదు. సమయం ఆదా అవుతుంది. ఎలాంటి అవకతవకలు జరగవు.
– బొడ్డేపల్లి రమణమ్మ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు, బూర్జ మండలం

సమయం ఆదా



ప్రభుత్వం తెచ్చిన కొత్త పద్ధతి బాగుంది. పాత విధానం వల్ల కొద్దిపాటి సమస్యలు తలెత్తేవి. నూతన విధానం ద్వారా గడువు సమయంలోపు చెల్లింపులు జరుపుకొనే వీలు ఉంటుంది. ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.
– డాక్టర్ డి.వి విద్యాసాగర్, డీఆర్‌డీఏ పీడీ

పేటీఎంల ద్వారా సులభం



జిల్లాలో 30 మండలాల్లో వంద శాతం అందరికీ అవగాహన కల్పిస్తాం. పేటీఎం ద్వారా ఇప్పటికే ప్రతి గ్రామం నుంచి 4 లేదా 5 లావాదేవీలు జరిపాం.ఆరుగురు మేనేజర్ల ద్వారా అన్ని మండలాల్లో అవగాహన కల్పిస్తున్నాం. 30 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అవగాహన కల్పించాం. ఈ విధానం ద్వారా సమయం ఆదా, ఖర్చు ఉండదు, చెల్లింపుల్లో కచ్చితత్వం ఉంటుంది.
– వి.సత్యనారాయణ, ఏజీఎం, స్త్రీ నిధి, శ్రీకాకుళం

'వసతుల్లేని పోలింగ్ కేంద్రాలు మార్చాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాగోలేని పోలింగ్ కేంద్రాలను మార్చాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. వివిధ రాజకీయ పార్టీలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో పాటు ఓట్ల తొలగింపులు, చేర్పులపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 22వ తేదీ నుంచి రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు కొండ ప్రాంతంలో ఉన్నందు వల్ల ఓటర్లకు అసౌకర్యంగా ఉందని చెప్పగా పోలింగ్ కేంద్రాన్ని మార్చాలంటే ప్రభుత్వ భవనం తప్పనిసరిగా ఉండాలని ఆయన చెప్పారు. జెడ్పీ సీఈఓ వెంకట్రామన్ మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల గురించి వివరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ శ్యామలాపురం పోలింగు కేంద్రం ఓటర్లకు సౌకర్యంగా ఉన్నదీ లేనిదీ తెలియజేయాలని తహసీల్దార్‌ను ఆయన ఆదేశించారు. మెళియాపుట్టి మండలంలో 7 పోలింగ్ కేంద్రాలు మార్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తహసీల్దార్ చెప్పారు. టీడీపీ నుంచి పీఎంజే బాబు షిఫ్టింగ్ ఓటర్ల గురించి, శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి చేర్పులు, తొలగింపులు జరిగాయని జాబితా కావాలని వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎం.స్వరూప్‌లు చెప్పగా సంబంధిత ఈఆర్‌ఓ నుంచి సమాచారాన్ని తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. సంతబొమ్మాళి మండలం బోరుబద్రలో ఒక పోలింగ్ కేంద్రంలో గొడవలు అవుతుంటాయని, ఆ కేంద్రాన్ని మార్చాలని రాజకీయ పార్టీలు కోరగా కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలంటే 1500 మంది ఓటర్లు ఉండాలని, ప్రభుత్వ భవనం తప్పనిసరిగా ఉంటేనే పోలింగ్ కేంద్రం మార్చడానికి అవకాశం ఉంటుందని ఇన్‌చార్జి కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్డీఓలు శాంతి, సీతారామ్మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళీకృష్ణ, జయదేవి, జెడ్పీ సీఈవో వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.

'నాయీ బ్రాహ్మణులంతా జగన్‌కు రుణపడి ఉంటారు'



మంత్రి ధర్మానను సన్మానించిన నాయీ బ్రాహ్మణులు

శ్రీకాకుళం రూరల్: నాయీ బ్రాహ్మణులంతా ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటారని, రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం చొరవతో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో మంగళవారం వాయిద్య కళాకారులకు ప్రభుత్వం మంజూరు చేసిన గుర్తింపు కార్డులను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో చేతి వృత్తులు పూర్తిగా నాశనమైపోయాయని అన్నారు. అలాంటి వారికి సామాజిక గౌరవం పెంచాలన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి మాట మీద నిలబడ్డారని తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలో ఉండే పాలక మండళ్లో నాయీ బ్రాహ్మణులను సభ్యులుగా చేర్చడం శుభపరిణామన్నారు.

నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు



నాగావళి నది పొన్నాడ వంతెన వద్ద ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో జరగనున్న గణేశుని నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ జీఆర్ రాధిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నాగావళి నది నీరు ప్రవహించే డేఅండ్ నైట్ పాత బ్రిడ్జి, పొన్నాడ వంతెన సమీపంలో ఇరువైపులా గల నిమజ్జన ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అపశ్రుతులు దొర్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎత్తైన విగ్రహాలకు పొన్నాడ వంతెన వద్ద నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు. నది నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున నదిలోకి ప్రజలెవరూ దిగకుండా చూడాలని, విగ్రహాలను క్రేన్ల సాయంతో నిమజ్జనం చేయాలని సూచించారు. అన్ని చోట్లా అవసరమైన సిబ్బందిని కేటాయించి ఇతర ప్రభుత్వ విభాగాలైన నగరపాలక సంస్థ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖల సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చూడాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రుతి, రెండో పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు బలివాడ గణేష్, నాగిరెడ్డి లక్ష్మణరావు ఉన్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు ఈ నెల 21వ తేదీన జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ ఎంపికలు శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని చెప్పారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను ఈనెల 29 నుంచి మార్టేరు వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ సీనియర్స్ చాంపియన్ షిప్–2023 పోటీలకు పంపించనున్నట్టు పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో ఎంపికలకు హాజరుకావాలని ఎమ్మెస్సార్ కోరారు. మరిన్ని వివరాలకు డీఎస్‌ఏ బాస్కెట్‌బాల్ కోచ్ జి.అర్జున్ రావురెడ్డి (99492 91288)ని సంప్రదించాలని ఆయన సూచించారు.

వేవేల రూపాలు.. కళ్లన్నీ దీపాలు

వీధివీధినా వినాయకుడు కొలువుదీరాడు. వేవేల రూపాల్లో దర్శనమిచ్చాడు. భక్తుల కళ్లనే దీపాలుగా మార్చాడు. ఊరూవాడా ఆధ్యాత్మిక వెలుగులు పంచాడు. పార్వతీ నందనుడిని పల్లెపల్లెనా ప్రజలు ఇష్టపూర్వక అవతారంలో తయారుచేసి అర్చించారు. అవతార గణపతిని చూసేందుకు భక్తులు మండపాలకు క్యూ కడుతున్నారు.





పెద్దబరాటం వీధిలో జగన్నాథుని అవతారంలో

అరసవల్లి రెల్లివీధిలో పల్లకిపై



కాశీబుగ్గ: అంబేద్కర్ నగర్‌లో వేషధారుల సందడి



పెద్దరెల్లివీధిలో శివుని సమేతంగా..



అక్కరపాసిని ఆర్టెట్‌లో గణనాథుడు



అరసవల్లికోవెల వీధిలో హంసవాహనంపై



సుబ్రహ్మణ్యస్వామితో నృత్యం చేస్తున్నట్టు..

ఇస్రోను అభినందిస్తూ..




కొత్తరేవులో ఏర్పాటు చేసిన చంద్రయాన్ గణేష్ మండపం

పోలాకి: మండలంలోని తీర ప్రాంత గ్రామం కొత్తరేవులో స్థానిక యువత వినూత్న రీతిలో వినాయక మండపం ఏర్పాటు చేశారు. చంద్రయాన్–4 పేరుతో మండపం సెట్ సిద్ధం చేసి అందులో గణేశుడిని ఏర్పాటు చేశారు. ఇస్రో శాస్త్రవేత్తల ఘనత అందరికీ తెలిసేలా వినూత్నంగా చవితి వేడుక నిర్వహించారు.



కాశీబుగ్గ: జీడి వినాయకుడు



మేదరవీధిలో కృష్ణుని అవతారంలో



రైతుబజారులో రాముని అవతారంలో

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో అసోం హోమ్ సెక్రటరీ రవి కోత



కోత రవికి ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని అసోం రాష్ట్ర హోమ్ సెక్రటరీ కోత రవి కుటుంబ సమేతంగా సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వీరికి ఈఓ హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ గౌరవ స్వాగతం పలికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కుటుంబ సభ్యులు దుప్పల రవీంద్రబాబు తదితరులు ఉన్నారు.

అట్టాడ, జంధ్యాలకు గురజాడ పురస్కారాలు



అట్టాడఅప్పలనాయుడు



జంధ్యాల శరత్‌బాబు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు సాహితీ సంస్థ 'సేవ' ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సౌజన్యంతో గురజాడ సాహితీ పురస్కారాలకు జిల్లాకు చెందిన సాహితీ వేత్తలు అట్టాడ అప్పలనాయుడు, జంధ్యాల శరత్‌బాబు ఎంపికయ్యారు. ఈనెల 21న గురజాడ జయంతి ఉత్సవంలో విశాఖలోని పౌరగ్రంథాలయంలో ఈ పురస్కారాలను అందచేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

ఖోఖో అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా పొన్నాడ రవి



పొన్నాడ రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్‌గా పొన్నాడ రవికుమార్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాకుళంలో ఖోఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. నూతన కార్యవర్గ ఎంపికలో భాగంగా అసోసియేషన్ చైర్మన్‌గా పొన్నాడ రవికుమార్‌తో పాటు జిల్లా అధ్యక్షునిగా చిట్టి నాగభూషణంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పిడుగుపాటుకు 20 మేకలు మృతి



సవరబడగాం కొండపై పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు

నందిగాం: మండలంలోని బడగాం పంచాయతీ సవర బడగాం కొండపై సోమవారం పిడుగుపాటుకు గురై 20 మేకలు మృతి చెందాయి. సవర బడగాంకు చెందిన సవర లక్ష్మయ్య తనకు చెందిన మేకల మందను గ్రామానికి ఆనుకొని ఉన్న కొండపై మేతకు తీసుకువెళ్లాడు. అయితే సాయంత్రానికి ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో పాటు పిడుగు పడటంతో 20 మేకలు మృతి చెందాయి. మరికొన్ని మేకలు కొండలో చిక్కుకున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కొండపై వెతికి మృతి చెందిన మేకలను గర్తించారు. ఇంకా కొన్ని మేకలు ఆచూకీ తెలియడం లేదు.

ఇంటిపై పిడుగుపాటు



పిడుగుపాటుకి గురై విరిగిన ఇంటిపైభాగం

ఇచ్ఛాపురం: బెల్లుపడ గ్రామానికి చెందిన ఉప్పాడ మోహన రావు ఇంటిపై మంగళవారం సాయంత్రం పిడుగు పడింది. ఈ ఘటనలో ఇంటిలోని గల టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్లు, ఇన్వర్టర్లు పూర్తిగా పాడయ్యాయి. నేరుగా ఇంటిపైనే పిడుగు పడడంతో గోడలు బీటలు వచ్చి పైభాగం కూలిపోయి బైక్ కూడా దెబ్బ తింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

ఐదేళ్ల పిల్లాడిపై కుక్కల దాడి

పొందూరు: స్థానిక శ్రీశయనవీధిలో సోమవారం సాయంత్రం కుక్కల దాడిలో 5 ఏళ్ల బాలుడు తరుణ్‌సాయి తీవ్రంగా గాయపడ్డాడు. వీధిలో ఆడుకుంటున్న తరుణ్‌పై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. నాలుగైదు చోట్ల గాయపరిచాయి. వెంటనే సమీపంలో ఉన్నవారు కుక్కలను తరిమేసి బాలుడిని రక్షించారు. వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో అధికారులకు ఇదివరకే ఫిర్యాదు చేశారు. వారు పట్టించుకోకపోవడంతోనే బాలుడు కుక్కల దాడిలో గాయపడ్డాడని వీధి వాసులు చెబుతున్నారు.

ప'వర్రీ' తగ్గించేందుకు

- జిల్లాలో కొత్తగా 13 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు
- ప్రస్తుతం జిల్లాలో 95 33/11 కేవీ సబ్‌స్టేషన్లు
- 2030 సంవత్సరానికి లోడుకు తగ్గట్టుగా కేంద్రానికి ప్రతిపాదనలు



కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణానికి పర్లాకిమిడి రోడ్డులో మందాలమ్మ గుడి పక్కన ఎంపిక చేసిన స్థలం

నరసన్నపేట: జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఈపీడీసీఎల్ శ్రీకాకుళం సర్కిల్ విభాగం అన్ని చర్యలు తీసుకుంటోంది. సబ్‌స్టేషన్లను ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తూ ఫీడర్ల వారీగా సమస్యలు పరిష్కరిస్తోంది. అలాగే రోజురోజుకీ పెరుగుతున్న డిమాండ్ తగ్గట్టుగా విద్యుత్ సరఫరాను మెరుగు పరుస్తోంది. రానున్న 2030 కల్లా మరింతగా విద్యుత్ వినియోగం పెరుగుతుందని భావించిన విద్యుత్ శాఖ జిల్లాలో మరిన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తోంది.

ఇప్పుడున్న సబ్‌స్టేషన్లకు అదనంగా మరో 13 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 106 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 95, 132/33 కేవీ సబ్‌స్టేషన్లు 9, 220/133 కేవీ సబ్‌స్టేషన్లు రెండు ఉన్నాయి. వీటికి తోడు మరో 13 సబ్‌స్టేషన్ల నిర్మాణం అవసరమని విద్యుత్ శాఖ భావిస్తోంది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ సంస్థల సూచనలు మేరకు ఆర్డీఎస్ఎస్ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం కింద ప్రతిపాదనలను ఈపీడీసీఎల్ శ్రీకాకుళం సర్కిల్ అధికారులు పంపారు. ఇది కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్కీమ్. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేస్తుంది. 2025 కల్లా వీటిని నిర్మించాలనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం స్థల సేకరణలో అధికారులు ఉన్నారు. ఇందులో భా గంగా శ్రీకాకుళంలో మరో రెండు సబ్‌స్టేషన్లు రానున్నాయి. ఒకటి పీఎన్ కాలనీలో, మరొకటి విశాఖ ఏ కాలనీలో నిర్మాణం కానున్నాయి. అలాగే నరసన్నపేట మండలంలో మరో సబ్‌స్టేషన్ నిర్మాణం కానుంది. ప్రస్తుతం నరసన్నపేటతో పాటు దేవాది, ఉర్లాంలో మూడు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. నూతనంగా జమ్ము సమీపంలో మందాలమ్మ గుడి వద్ద పర్లాకిమిడి రోడ్డుకు ఆనుకుని కొత్తది ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు నరసన్నపేట తహసీల్దార్ సింహాచలం 40 సెంట్లు స్థలాన్ని కేటాయించారని ట్రాన్స్‌కో ఏఈ కోటేశ్వరరావు తెలిపారు.



నరసన్నపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్

కొత్తగా ప్రతిపాదించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్లు

కొత్తూరు (మెట్టూరు), హిరమండలం(భగీరథపురం), మెళియాపుట్టి (బందపల్లి), నరసన్నపేట టౌన్ (జమ్ము), నందిగాం (జగతిమెట్ట), కోటబొమ్మాళి (జర్జంగి), కంచిలి (జేఎల్ కోట), గార (శ్రీకూర్మం), శ్రీకాకుళం డీ–1 (విశాఖ ఏ కాలనీ), శ్రీకాకుళం డీ–2(పీఎన్ కోలనీ), రణస్థలం (సీహెచ్‌పీ రాజాం), శ్రీకాకుళం డీ–3 ఎచ్చెర్ల (కుప్పిలి), పాలకొండ (గరుగుబిల్లి)లలో నిర్మాణానికి ప్రతిపాదించారు.

ప్రతిపాదనలు పంపించాం

నరసన్నపేట టౌన్ పరిధిలో విద్యుత్ లోడ్ అధికంగా ఉంది. విద్యుత్ కనెక్షన్లు అధికంగా పెరుగుతున్నాయి. టౌన్ పరిధిలో ప్రస్తుతం ఒక సబ్‌స్టేషన్ ఉంది. జమ్ము వద్ద రెండోది ప్రతిపాదిస్తున్నాం. ఇది నిర్మాణం అయితే నరసన్నపేట టౌన్‌ను ఒక సబ్‌స్టేషన్ పరిధిలో ఉంచి రూరల్ గ్రామాలు జమ్ము, తామరపల్లి, కంబకాయ, కరగాం, గొట్టిపల్లి, జదూరు తదితర గ్రామాలన్నింటినీ కొత్త సబ్‌స్టేషన్ పరిధిలోకి మార్పు చేస్తాం.

– కోటేశ్వరావు,
ఏఈ, నరసన్నపేట మండలం

చోరీ చేసింది బంధువే..!



చోరీకి గురైన బంగారు ఆభరణాలను విలేకరులకు చూపుతున్న పోలీసులు

నరసన్నపేట: మండలం కంబకాయలోని పాగోటి సావిత్రి ఇంటిలో ఆదివారం జరిగిన చోరీ కేసును నరసన్నపేట పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. చోరీకి గురైన బంగారు ఆభరణాలతో పాటు నగదును కూడా రికవరీ చేశారు. ఐటీఐ చదివి నరసన్నపేటలో జి కమ్యూనికేషన్ ఫైబర్ నెట్‌లో పనిచేస్తున్న తర్ర జానకిరావు (ఫిర్యాదు దారు చెల్లి కుమారుడు)ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సీఐ బూర ప్రసాదరావు తెలిపారు. ఆయన మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఆదివారం వేకువజామున చోరీ జరిగినట్లు సావిత్రి కుమారుడు రమేష్ ఫోన్‌లో సమాచారం ఇచ్చారని, వెంటనే స్పందించి సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. సంఘటన పరిశీలన తర్వాత కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన వివరాలు, చోరీ జరిగిన తీరు ఆధారంగా ఇంటిలోనే ఉన్న వ్యక్తులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని భావించి ఆ దిశగా దర్యాప్తు చేశామని సీఐ తెలిపారు. శనివారం రాత్రి 11 గంటల వరకూ చోరీ జరిగిన గదిలో కుటుంబ సభ్యులు ఉన్నారని, మళ్లీ ఆదివారం వేకువజామున 2 గంటల సమయంలో సావిత్రి చూస్తే బీరువా తెరిచి ఉండటం లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలు కనిపించక పోవడాన్ని గమనించి ఇంట్లో వ్యక్తుల పనే అని భావించామన్నారు. వేలి ముద్రలను సేకరించామని, డీఎస్పీ బాలచంద్రా రెడ్డి ఆదేశాలతో కుటుంబ సభ్యులను విచారణ చేయగా తర్ర జానకీరాంపై అనుమానం వచ్చి దర్యాప్తు చేస్తే అతను నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. చోరీకి పాల్పడిన జానకిరామ్ తల్లి మృతి చెందగా పెద్దమ్మ వద్దే ఉండి ఐటీఐ చదువుకున్నాడు. సొంత షాపు పెట్టుకోవడానికి పెట్టుబడి కోసం ఈ ఆభరణాలు దొంగతనం చేశానని అతను అంగీకరించాడని సీఐ తెలిపారు. చోరీకి గురైన పదకొండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 15 వేల నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. కేసులో నరసన్నపేట ఎస్ఐ సింహాచలంతో పాటు సర్కిల్ ప్రత్యేక నిఘా సిబ్బంది ఏఎస్ఐ మస్తాన్, కానిస్టేబుల్ శ్రీనివాస్, నరసన్నపేట ఏఎస్ఐ ఆశిరినాయుడు, సీసీఎఫ్ ఎస్ఐ రఫూల్‌లు చురుకైన పాత్ర పోషించి చోరీ సొత్తును రెండు రోజుల్లో రికవరీ చేశామన్నారు.

రూ.13 కోట్లతో 83 గ్రామాలకు శుద్ధజలం



అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: మండలంలోని 83 గ్రామాల ప్రజలకు సుమారు రూ.13కోట్లతో శుద్ధజలం అందించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి అన్నారు. మండల కేంద్రంలో ఉన్న జలజీవన మిషన్ సామగ్రిని మంగళవారం పరిశీలించి, కాంట్రాక్టర్‌ను వివరాలను అడిగి పనులు త్వరితగతిన మొదలు పెట్టాలన్నారు. ఉద్దానం ప్రజలకు శుద్ధజలం అందించాలనే తపనతో సీఎం వైఎస్ జగన్ రూ.700 కోట్లతో మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును మెళియాపుట్టిలో ఏర్పాటుచేశారని, పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు సైతం తాగునీరు ఇవ్వాలని సీఎంను కోరడంతో మరో మరో రూ.265కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. జలజీవన మిషన్ ద్వారా 90 కిలోమీటర్ల పొడవు వరకూ పైప్‌లైన్ వేయాల్సి ఉండగా వంద శాతం సామగ్రి మండలకేంద్రానికి చేరుకున్నాయని, ప్రస్తుతం గంగరాజపురం గ్రామంలో పనులుసైతం మొదలుపెట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆమెతో పాటు జెడ్పీటీసీ ఎండయ్య, పార్టీ నాయకుడు ఉదయ్ కుమార్, మండల కన్వీనర్ యోగి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, శశిభూషణ్ రావు, తేజారావు, మండల నాయకులు జయమునిరావు, టి. ప్రసాదరావు, పలువురు సర్పంచులు తదితరులు ఉన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైస్ మిల్లర్స్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అంపోలు వద్ద రైస్ మిల్లర్స్ భవనంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఎన్నికలకు అసోసియేషన్ శాశ్వత గౌరవ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కింజరాపు ప్రసాద్‌లు పరిశీలకులుగా వ్యవహరించారు. గత ఏడాదిగా ఉన్న కార్యవర్గాన్నే సభ్యులంతా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా రెడ్డి విజయశ్రీ వెంకటేశ్వరరావు (వాసు) హ్యాట్రిక్ విజయం సాధించారు. మొత్తం ఐదుసార్లు ఆయన జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్‌కు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేషన్‌కు ప్రస్తుతం ఆయన ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేస్తున్నారు. మిగిలిన కార్యవర్గంలో కేవీ గోపాల్ కార్యదర్శిగా, తాళాసు కష్టారావు కోశాధికారిగా, పాగోటి రాములు ఉప కోశాధికారిగా, లాడి రమేష్ పీఆర్వోగా ఎన్నికయ్యారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా ముద్దాడ సూర్యనారాయణ, అంధవరపు ధనుంజయ్, శాసనపురి కుమారస్వామి, రాంబాబు, టంకాల అర్జున బాబు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా కోరాడ శంకరరావు, పిరియా విజయ్ కుమార్‌లను ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గాన్ని ధర్మాన కృష్ణ దాస్ అభినందించారు. రానున్న రెండు నెలల్లో నూతన భవన నిర్మాణాన్ని పూర్తిచేసి, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, బగ్గ లక్ష్మణరావు, తంగుడు నాగేశ్వరరావు, జోగి శెట్టి, జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

'పర్యాటక స్థలాలను అభివృద్ధి చేసుకోవాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పర్యాటక స్థలాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని జిల్లా పర్యాటక అధికారి ఎస్.నారాయణరావు అన్నారు. జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించడంలో విద్యార్థులు, యువత వివిధ కార్యక్రమాలు చేసేందుకు యువ పర్యాటక క్లబ్‌లు దోహద పడతాయన్నారు.

శ్రీకాకుళంలోని బ్యాంకర్స్‌కాలనీలో ఉన్న వికాస్ హై స్కూల్, రాగోలు జెడ్పీహెచ్‌స్కూల్‌లో మంగళవారం యువక్లబ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ కలెక్టర్, పర్యాటకశాఖ కమిషనర్ ఆదేశాలననుసరించి ఈ యువ క్లబ్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. ముందుగా ప్లాస్టిక్ వాడడం వలన కలిగే అనర్థాలు పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని పిల్లలకు వివరించారు. ప్రతి ఒక్కరు మన పండగలు, జాతరలు, కళారూపాలు భావితరాల వారికి తెలియజేయాలంటే నేటి యువత వాటిపై డాక్యుమెంట్ తీసి అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

యువ క్లబ్‌ల ఆవశ్యకతను వివరించారు. జిల్లాలో ఉన్న పలు పర్యాటక ప్రాంతాల గురించి వివరిస్తూ దాని విశిష్టత, ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమానికి కూన మురళీకృష్ణ, జి.నిర్మల, వి.జగన్నాథ మూర్తి, కె.వేణుగోపాల్, ఉపాధ్యాయులు తదితరులు హాజరయ్యారు.

కళింగపట్నం బీచ్‌లో యువకుడు గల్లంతు



కూన ప్రవీణ్ (ఫైల్)

గార,ఆమదాలవలస: కళింగపట్నం బీచ్‌లో ఆమదాలవలస సమీపంలోని కృష్ణాపురానికి చెందిన కూన ప్రవీణ్ (14) మంగళవారం సాయంత్రం గల్లంతైపోయాడు. ప్రవీణ్ తల్లి తల్లి ఉష, మరో బంధువుతో కలిసి మంగళవారం సాయంత్రం బీచ్‌కు వచ్చాడు. కాసేపు స్నానం కూడా చేశాడు. తర్వాత చేతులు కడుక్కుని వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో నీటిలో పడిపోయి ఉంటాడని అంతా భావిస్తున్నారు.

వంశధార, సముద్రం సంగమ స్థలం కావడం, బురద నీరు ఉండడంతో యువకుడి ఆచూకీ దొరకలేదని పోలీసులంటున్నారు. మెరైన్ పోలీసు సిబ్బందికి సమాచారమివ్వగా గాలింపు చర్యలు చేపట్టారు. సీఐ ఎస్.కామేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో అతడిడి తల్లి కన్నీరుమున్నీరయ్యారు. యువకుడి తండ్రి ప్రసాదరావు మూడేళ్ల కిందటే చనిపోయారు. అన్నయ్య కార్తీక్ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు.

పండగ పూట విషాదం

- రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి
- ఆబోతులపేటలో విషాదం



భార్య కుమారుడితో మృతుడు రవి

జి.సిగడాం: పండగ పూట ఆ కుటుంబంలో విషాదం అలముకుంది. వినాయక చవితి వైభవంగా నిర్వహించుకుందామని భార్యకు చెప్పి వెళ్లిన భర్త మార్గం మధ్యలో బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. విశాఖలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆనందపురం పంచాయతీ ఆబోతులపేట గ్రామానికి చెందిన కీస రవి(27) వినాయక చవితి సామాన్లు కొనుగోలు చేయడానికి ఆదివారం రాత్రి పొందూరు వెళ్లి తిరిగి ఆబోతులపేట గ్రామానికి వస్తుండగా.. ఆనందపురం, వాండ్రంగి గ్రామ సమీపంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద మరో బైక్ రవి బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో రవి తీవ్రంగా గాయపడ్డాడు. మరో నలుగురికి కూడా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని శ్రీకాకుళంలోని కిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి విశాఖ పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ రవి సోమవారం కన్నుమూశాడు. రవి వెనుక కూర్చున్న సోమరాజుల కృష్ణ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. అలాగే పొందూరుకు చెందిన స్వరూప సాయి, హరి సాయి, పేడాడ దామోదరరావు రాజాం కేర్‌లో చికిత్స తీసుకుంటున్నారు. మృతుడికి భార్య స్వామి, తొమ్మిది నెలల బాబు ఉన్నారు. పండగ వేళ ఇంతటి విషాదం జరగడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సామంతుల రామారావు తెలిపారు.

రాష్ట్ర పోటీలకు పయనం



రాష్ట్రపోటీలకు ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులతో డీఈఓ వెంకటేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ విద్యా సంవత్సరం కొత్త సీజన్‌లో రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీలు మొదలుకానున్నాయి. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు విజయవాడ కేంద్రంగా ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్–14, అండర్–17 బాలబాలికల రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే శ్రీకాకుళం జిల్లా బృందం మంగళవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లింది. వీరికి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, డీఈఓ కె.వెంకటేశ్వరరావు స్వయంగా తన ఛాంబర్‌లో అభినందించి, వీడ్కోలు పలికారు. సిక్కోలు సత్తా చాటిచెప్పాలని డీఈఓ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, ఎం.ఆనంద్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు. కోచ్ మేనేజర్లగా వ్యవహరిస్తున్న పీడీలు దుర్గయ్య, రామారావు, శాప్ కోచ్ బి.గోవిందరావు వ్యవహరిస్తున్నారు.

తెగిన విద్యుత్ తీగలు.. నిలిచిన రైళ్లు



జి.సిగడాం: స్టేషన్‌లో నిలిచిపోయిన ఈఎంయూ రైలు



సుద్దగెడ్డ వద్ద తెగిపోయిన వైర్లు

జి.సిగడాం: బాతువ–ఎందువ గ్రామాల సమీపంలో ఉన్న సుద్దగెడ్డ వద్ద సోమవారం రైల్వే ఓహెచ్ వైర్లు తెగిపడటంతో రైళ్లు నిలిచిపోయాయి. మధ్యాహ్నం 3.15 నిమిషాలకు విద్యుత్ తీగలు తెగిపోయాయి. సాయంత్రం 5 గంటలకు పనులు పూర్తి చేసి పలు రైళ్లు మళ్లించారు. కన్యాకుమారి–దిబ్రుఘర్ సూపర్ ఫాస్ట్ రైలును చీపురుపల్లి వరకు డౌన్ చేసి అనంతరం ఆఫ్‌లైన్ ద్వారా మళ్లించారు. జి.సిగడాం స్టేషన్‌లో ఈఎంయూ రైలును 2 గంటల పాటు నిలిపారు. రైల్వే అధికారులు హుటాహుటిన విద్యుత్ తీగలు సరిచేశారు. రెండు గంటల పాటు ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

గిరిజన హక్కులపై శిక్షణ

మెళియాపుట్టి: గిరిజనులు వారి హక్కులను తప్పకుండా తెలుసుకోవాలని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మండలంలోని కేరాశింగి పంచాయతీ పరిధిలోని గొడ్డ గ్రామంలో గిరిజన హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగడవెల్లి, వీరన్నపేట, ముత్యాలబొంతు, రింపి గ్రామాల ప్రజలు హాజరయ్యారు వారికి పోడుపట్టాలు పొందడం, అటవీ హక్కుల గురించి తెలియ జేశారు. పలు హక్కుల కోసం దరఖాస్తులు ఎలా చేసుకోవాలో వివరించారు. సర్పంచ్ ఆదిలక్ష్మి, అసోసియేషన్ సభ్యులు జగన్, చంద్రరావు లతో పాటుగా పలువురు గిరిజనులు ఉన్నారు.

26, 29 తేదీల్లో వ్యాసరచన పోటీలు

శ్రీకాకుళం కల్చరల్:

రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల్లో నైతిక పరివర్తన, మానవత్వ విలువలు పెంపొందించేందుకు ఈనెల 26, 29 తేదీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. స్థానిక పెండమందిరంలో వినాయక ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8, 9, 10 తరగతి విద్యార్థులకు 'ఆచార్యదేవో భవ' అంశంపైన, ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకు 'ప్రకృతియే ఉత్తమ గురువు' అనే అంశంపైన, డిగ్రీ ఆపై స్థాయి విద్యార్థులకు 'మానవత్వంను పెంపొందించు విద్యావశ్యకత' అనే అంశంపై తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రిమ్స్ అన్నపూర్ణ ట్రస్టు అధ్యక్షులు గంగుల రమణబాబు మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 100 గంటల అఖండ నామ సంకీర్తన 40 మందిరాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల ప్రారంభంలో వరం చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ సమాజ సేవకులు అంధవరపు ప్రసాద్ దంపతులు గణపతి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹245	₹ 265